సహకార బ్యాంకులను ప్రజలే రక్షించుకోవాలి

ఆర్‌బీఐ విశ్రాంత అధికారి ఆర్‌ఎం వైద్యనాథ్



సభలో పాల్గొన్న రిటైర్డ్ ఆర్‌బీఐ రిటైర్డ్ అధికారి వైద్యనాథ్, తదితరులు

నాగోలు: దేశంలో సహకార బ్యాంకుల ఏర్పాటు 1904లోనే ప్రారంభమైందని, దేశానికి స్వాతంత్రం వచ్చే నాటికే 2 వేల సహకార బ్యాంకులు ఉన్నాయని రిటైర్డ్ ఆర్‌బీఐ అధికారి ఆర్‌ఎం వైద్యనాథ్ తెలిపారు. మల్టీ స్టేట్ విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంక్ నాగోలు బ్రాంచ్ 109 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం నాగోలు పరిధిలోని స్వాగత్ గ్రాండ్‌లో మహాజన సభ ఏర్పాటు చేశారు. సభకు అధ్యక్షత వహించిన ఆర్‌ఎం వైద్యనాథ్ మాట్లాడుతూ, స్వాతంత్ర అనంతరం భారతదేశంలో 40 ఏళ్ల పాటు సహకార వ్యవస్థను బలిష్టం చేయడానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఆర్‌బీఐ సూచనలు చేస్తూ వచ్చిందన్నారు. ఆ తర్వాత పాలకులు, బ్యాంకింగ్ రంగం నిపుణులు స్వార్థంతో సహకార బ్యాంకులను బలహీనపర్చడానికి ఆర్‌బీఐని ఉపయోగించుకోవడం మొదలు పెట్టారన్నారు. అయినా కొన్ని బ్యాంకులు నిలదొక్కుకొని ముందుకు సాగుతున్నాయన్నారు. సహకార బ్యాంకులను ప్రజలే రక్షించుకోవాలని ఈ సందర్భంగా వైద్యనాథ్ పిలుపునిచ్చారు, అనంతరం డైరెక్టర్ జేవీ సత్యనారాయణ మాట్లాడుతూ, విశాఖపట్నం కో–ఆపరేటివ్ బ్యాంకు అన్ని రకాల ఖాతాదారులకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతూ ముందుకు వెళ్తున్నదని అన్నారు. అనంతరం నాగోల్ శాఖ సంప్రదింపుల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా నారాయణరెడ్డి, గోవిందరావు, సుధాకర్ రెడ్డి, బొడ్డుపల్లి కృష్ణ, ఎంవీ మూర్తి, నాగజ్యోతిలను ఎన్నుకున్నారు.

అనుమతుల్లేని పాఠశాలలను మూసివేయాలి

విద్యాశాఖ అధికారికి ఏఐవైఎఫ్ వినతి



డిప్యూటీ డీఈఓకు వినతి పత్రం ఇస్తున్న షేక్ మహమూద్

సైదాబాద్: సైదాబాద్ మండల పరిధిలో ప్రభుత్వ అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ పాఠశాలలను వెంటనే మూసివేసేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహమూద్ కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఏఐవైఎఫ్ ప్రతినిధులతో కలిసి సైదాబాద్ మండల విద్యాశాఖ డిప్యూటీ డీఈఓ రాధాకృష్ణకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్ ఆగమ్యగోచరం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారుల విద్యా భవితవ్యాన్ని దృష్టిలో పెట్టుకొని అధికారులు సదరు పాఠశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల రేంజ్–1 అధికారి పాషా పాల్గొన్నారు.

మలక్‌పేటలో వాటర్ లాగింగ్ 10 పాయింట్లు

- గుర్తించిన అధికారులు
- కార్యాచరణ ప్రణాళిక సిద్ధం
- వరద నిలిచే చోట ముందస్తు జాగ్రత్తలు

చాదర్‌ఘాట్: వర్షా కాలం మొదలవుతుందంటే చాలు మలక్‌పేట లోతట్టు ప్రాంతవాసుల్లో తీవ్ర భయాందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రతీ సంవత్సరం మాదిరిగా కాకుండా ఈసారి వానా కాలనికి ముందే మలక్‌పేట జలమండలి అధికారులు వరదనీరు నిలిచిపోయే ప్రాంతాలపై దృష్టి పెట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే కాకుండా మ్యాన్‌హోళ్ల వద్ద మరమ్మతులు చేపడుతున్నారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద ప్రమాదాలు జరగకుండా మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేపడుతున్నారు.

◆ మలక్‌పేట సర్కిల్‌కు వచ్చే ఓల్డ్‌మలక్‌పేట, అక్బర్‌బాగ్, మూసారాంబాగ్, సైదాబాద్ డివిజన్ల పరిధిలో దాదాపు 10 చోట్ల వరదనీరు నిలుస్తున్నదని జలమండలి అధికారులు గుర్తించారు.

◆ మలక్‌పేట సర్కిల్–6 జనరల్ మేనేజర్ శీలా రాణి ఆధ్వర్యంలో సంబంధిత సెక్షన్ మేనేజర్లు, సిబ్బంది గుర్తించిన వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద తనిఖీలు మొదలు పెట్టారు.

◆ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల మూతలు లేని చోట్ల కొత్తవి ఏర్పాటు చేస్తున్నారు. దెబ్బ తిన్న మ్యాన్‌హోళ్లకు మరమ్మతులు చేయిస్తున్నారు. లోతుగా ఉన్న మ్యాన్‌హోళ్ల వద్ద సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు.

◆ ఇచ్చట వరదనీరు నిలుస్తుందని పేర్కొంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.

◆ ప్రజల కూడా తమ వంతు బాధ్యతగా మురుగునీటి మ్యాన్‌హోళ్ల లోకి వరదనీరు వెళ్లకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని మేనేజర్ శీలారాణి గుర్తు చేస్తున్నారు.



ఓల్డ్‌మలక్‌పేటలో వాటర్ లాగింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మ్యాన్‌హోళ్లను తొలగిస్తే క్రిమినల్ చర్యలు



జలమండలి అధికారుల ప్రమేయం లేకుండా మ్యాన్‌హోళ్లను తొలగిస్తే క్రిమినల్ కేసులు పెడతాం. జరిమానాలు కూడా విధిస్తాం. అలాగే ఇళ్లపై కురిసే వర్షం నీరు డ్రైనేజీలోకి వదలకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకొని వాటిలోకి పంపాలన్నారు.

– డీజీఎం శీలారాణి

కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుంది



అక్బర్‌ను సన్మానిస్తున్న నాయకులు

మలక్‌పేట: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, ఆ పార్టీ మలక్‌పేట ఇన్‌ఛార్జ్ షేక్ అక్బర్ అన్నారు. మూసారాంబాగ్ డివిజన్‌లో గురువారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. శాలువాతో అక్బర్‌ను సన్మానించి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ చేరేలా చూడాలని, పార్టీ పటిష్టతకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ భువనగిరి చంద్రశేఖర్, బాబు శ్రీను, ధన్వంత్, అశ్వక్ ఖాన్, కొమిరెల్లి రాజశేఖరరెడ్డి, గంట్ల కృష్ణ, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, పలు మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని ఈ కింద ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని డీఈ హన్మంత్‌రెడ్డి తెలిపారు.



◆ ఉ. 11 నుంచి మ, 12:30 గంటల వరకు...
ఆటో మీటర్ సీల్ ఆఫీస్, సింగరేణి కాలనీ పార్క్, ఆదర్శనగర్ నాలా, సరస్వతి శిశు మందిర్, సరూర్‌నగర్ చెరువు కట్ట, సింగరేణి కాలనీ గుర్జ పీటీ, ఎంసీహెచ్ కాలనీ, రేస్‌కోర్స్ రోడ్, లైబ్రరీ పీటీ, వాణీ స్కూల్ పరిసర ప్రాంతాలు.

◆ మ, ఒంటి గంట నుంచి 2 గంటల వరకు...
శంకేశ్వరబజార్, గ్రీన్ అపార్ట్స్, సింగరేణి కాలనీ పెట్రోల్ పంప్, పీఅండ్‌కాలనీ కల్లు కౌంపౌండ్ పరిసర ప్రాంతాలు.

◆ మ. 3.30 నుంచి సా. 5 గంటల వరకు...
సరస్వతీ నగర్ శిశు మందిర్, గ్యాస్ గొడౌన్, ఖాజాబాగ్, విష్ణునగర్, మదర్సా పరిసర ప్రాంతాలు

◆ ఉ. 10 నుంచి మ. ఒంటి గంట వరకు...
ఐబీపీ పెట్రోల్ పంప్ ఐఎస్‌సదన్ క్రాస్‌రోడ్, సంతోష్‌నగర్ ఓల్డ్ అండ్ న్యూ కాలనీ పరిసర ప్రాంతాలు.

◆ మ. 12.30 నుంచి మ. 1.30 వరకు...
అజంతా కాలనీ, ప్రిన్స్ బాడీగార్డ్ లేన్, రేస్‌కోర్స్ రోడ్ పరిసర ప్రాంతాలు

◆ మ. 2.30 నుంచి సా. 5 గంటల వరకు...
ఫకీరీ గల్లీ, జమాల్ కాలనీ, పోచమ్మ టెంపుల్ పరిసర ప్రాంతాలు.

మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసిన శ్రీనివాస్ గుప్తా



నాగోలు: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పుట్టిన రోజు సందర్భంగా గాంధీభవన్‌లో శుక్రవారం ఆయనను టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్ ఉప్పల శ్రీనివాస గుప్తా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మహేష్‌కుమార్ గౌడ్‌ను శాలువాతో సన్మానించి బహుమతి అందజేశారు.

రైతుబజార్లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో...) టమోటా లోకల్ 27, వంకాయ 23, బెండ 45, పచ్చిమిర్చి 50, కాకర 35, బీర 35, క్యాలీఫ్లవర్ 18, క్యాబేజీ 17, క్యారెట్ 40. దొండ 31, ఆలు 31, ఉల్లి 24, గోకర 40, దోస 23, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 70, అర్వి 40, మునగ 50, చిలగడదుంప 75, బీట్‌రూట్ 19, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 125, కాప్సికమ్ 45. శనివారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈధరలు అమలులో ఉంటాయి.

కలుషిత నీరు సరఫరా కాకుండా చర్యలు



కాలనీవాసులతో మాట్లాడుతున్న పవన్‌కుమార్

నాగోలు: తాగునీటిలో మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలని కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్ అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని న్యూమారుతీ నగర్ కాలనీలో కలుషిత మంచి నీరు సరఫరా అవుతోందని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లడంతో శుక్రవారం ఆయన పరిశీలించారు. తాగు నీటిలో డ్రైనేజీ నీరు కలవడంతో కలుషిత నీరు సరఫరా అవుతోందని, వెంటనే నివారణ చర్యలు తీసుకుంటామని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు గోపాల్ యాదవ్, అశ్విన్ సింగ్, తిరుమల్, మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శివరామ ఆలయ కార్యవర్గం ప్రమాణ స్వీకారం



నూతన కార్యవర్గ సభ్యులతో కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

లింగోజిగూడ: డివిజన్ పరిధిలోని జానకీ ఎన్‌క్లేవ్ కాలనీలోని శివరామ ఆలయం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని శుక్రవారం దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. అధ్యక్షులుగా రమ, ఉపాధ్యక్షుడిగా రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా శంకర్, కోశాధికారిగా గోవర్ధన్, సంయుక్త కార్యదర్శిగా మాధవి ప్రమాణం చేశారు. సలహా సంఘం గౌరవ అధ్యక్షుడిగా స్థానిక కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్ రెడ్డి, సభ్యులుగా లక్ష్మారెడ్డి, ఈశ్వర్, దామోదర్ రెడ్డి, వెంకటేశ్ ప్రమాణ స్వీకారం చేశారు.

రోడ్లపై దుకాణాలను తొలగించాలి



కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీసరస్వతినగర్ కాలనీ ప్రతినిధులు

మన్సూరాబాద్: రాకపోకలకు ఇబ్బందులు కలిగించేలా రోడ్లను ఆక్రమించి ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలను తొలగించాలని కోరుతూ శ్రీ సరస్వతినగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు శుక్రవారం మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ, విజయవాడ జాతీయ రహదారి ప్రధాన రోడ్డు వద్ద కాలనీ ప్రవేశ మార్గాన్ని ఆక్రమించి ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలతో రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. అంతేకాకుండా జాతీయ రహదారి ఇరుకుగా మారి ట్రాఫిక్ సమస్యలు వస్తున్నాయన్నారు. స్పందించిన కార్పొరేటర్ సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు రామకిషన్, నాగేశ్వర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంగను సన్మానించిన నాయకులు

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా ఎన్నికైన బర్ల మంగ జగదీశ్‌కు అభినందనలు వెల్లువెత్తాయి. శుక్రవారం రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిలుక మధుసూదన్‌రెడ్డి, బర్ల మంగజగదీశ్‌ను కలిసి ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సారధ్యంలో నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు.ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పట్టణ టౌన్ అధ్యక్షుడు ఆకుల ఆనంద్, పార్టీ నాయకులు మహేష్ గౌడ్, కప్పరి లక్ష్మయ్య, కప్పరి చందు, శ్యామ్‌లాల్, కిరణ్, రమేష్, భార్గవ్, రాజు, రవికుమార్, మహేశ్ తదితరులున్నారు.

నంబర్ ప్లేటు లేని వాహనాలను సీజ్ చేస్తాం

ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్

మీర్‌పేట: నంబర్ ప్లేటు లేని వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని మీర్‌పేట పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.కాశీవిశ్వనాథ్ హెచ్చరించారు. రాచకొండ పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్ పరిధి విరాట్‌నగర్ చౌరస్తాలో శుక్రవారం సాయంత్రం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ముందు, వెనకాల నంబర్ ప్లేటు సరిగ్గా ఉండేలా చూసుకోవాలని సూచించారు. నిబంధనల మేరకు ప్రతి ఒక్క వాహనదారు నంబర్ ప్లేటుతో తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలని, లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అన్నారు. దాదాపు 50 వరకు వాహనాలను గుర్తించామని తెలిపారు.

లెక్క చెప్పాల్సిందే..

- గ్రామాల్లో మొదలైన ఉపాధిహామీ పనుల తనిఖీలు
- 2023–24 ఏడాదికి గాను చేసిన పనులు, ఖర్చులపై ఆరా



ఇబ్రహీంపట్నం రూరల్: ఉపాధి హామీ పనుల తనిఖీలు అధికారులకు వనుకు పుట్టిస్తున్నాయి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి జరగాల్సిన సామాజిక తనిఖీ ఈసారి ఆలస్యంగా జరుగుతోంది. ఈ తనిఖీల్లో ఇబ్రహీంపట్నం మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి చేపట్టిన ఖర్చులపై విచారణ చేపట్టనున్నారు. ఉపాధి హామి కూలీలకు చేసిన పనులు, ఖర్చు పెట్టిన నిధులు పై ఆరా తీయనున్నారు. ఇందు కోసం సామాజిక తనిఖీ బృందాలు ఇప్పటికే రికార్డులను స్వాధీనం చేసుకొని క్షుణ్ణంగా పరిశీలించే పనిలో పడ్డారు.

ప్రతీపైసాపై విచారణ..

ఇప్పటికే మండలంలో 16వ విడత సామాజిక తనిఖీ మొదలైంది. ఇందుకోసం తనిఖీ బృందాలు ఈ నెల 18వ తేదీ నుంచే గ్రామాలకు చేరుకున్నాయి. 01-04-2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 21-03-2024 వరకు పంచాయతీ రాజ్ రోడ్లు, సామాజిక అడవుల పెంపకం, కూలీలకు పని దినాలు కల్పించడం కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.4,22,82,609 కోట్లు ఖర్చు చేశారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఉపాధి కూలీలకు రూ.1.35 లక్షల పనిదినాలు కల్పించారు. నాలుగు వేల కుటుంబాలు జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. వీరిలో 6వేల జాబ్‌కార్డులు యాక్టివ్‌గా పనిచేస్తున్నాయి. సామాజిక అడవులు పెంపకం కోసం పంచాయతీరాజ్ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు వేశారు. అలాగే కూలీలతో చెట్లపొదలు తొలగించడం, కందకాలు, ఇంకుడు గుంతలు తవ్వించడం వంటి పనులు కల్పించారు. ఈ పనులు గ్రామాల్లో సక్రమంగా చేశారా, నిధులు సకాలంలో ఖర్చు చేశారా దుర్వినియోగం చేశారా అని క్షేత్ర స్థాయిలో పనులు పరిశీలించడంతో పాటు పనులు చేసిన కూలీలను కలిసి వివరాలు సేకరించనున్నారు.

25 నుంచి గ్రామసభలు..

ఈనెల 18వ తేదీ నుంచే సామాజిక తనిఖీ బృందాలు గ్రామాలకు చేరుకున్నారు. గ్రామాల్లో కూలీలు చేసిన పనులు కాంట్రాక్టర్ల ద్వారా వేసిన రోడ్లు, సామాజిక అడవుల పెంపకం పనులు పరిశీలించే పనిలో పడ్డారు. పరిశీలన అనంతరం ఈ నెల 25వ తేది నుంచి 14 గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు పెట్టి ప్రజాక్షేత్రంలో పరిశీలిస్తారు. 30వ తేదీన మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మండల బహిరంగ సభ నిర్వహించనున్నారు. ఈ గ్రామ, మండల సభల్లో పనులపై నివేదిక సమర్పిస్తారు. ఎలాంటి పొరపాట్లు ఉన్నా అక్కడే చదివి వినిపిస్తారు. గతంలో జరిగిన సామాజిక తనిఖీలపై మాట్లాడుతారు. ఎవరైనా అధికారులు అవినీతికి పాల్పడినా, నిధుల దుర్వినియోగానికి పాల్పడినా చర్యలు తీసుకుంటారు.

తనిఖీలకు సహకరించాలి

ఉపాధి హామీపై జరుగుతున్న ఉపాధి తనిఖీకు కూలీలు, కాంట్రాక్టర్లు, అధికారులు సహకరించాలి. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీ కార్యదర్శులు కూడా అందుబాటులో ఉండాలి. ఇప్పటికే వారికి కావాల్సిన ఏర్పాట్లు చేశాం. పూర్తిస్థాయిలో విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునేలా నివేదిక అందజేయాలి.

– క్రాంతికిరణ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ

ఆమన్‌గల్ రోడ్డు ప్రమాదంలో భైరామల్‌గూడ యువకుడి మృతి

స్థానికంగా విషాదఛాయలు



బుర్రా మణిదీప్ గౌడ్ (ఫైల్)

చంపాపేట: ఆమన్‌గల్‌లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు స్నేహితులతో పాటు చంపాపేట డివిజన్ భైరామల్‌గూడకు చెందిన బుర్రా మణిదీప్‌గౌడ్(25) మృతి చెందాడు. దీంతో స్థానికంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. వివరాలు.. గుంటూరు జిల్లా రేపల్లెకు చెందిన బుర్రా శ్రీనివాస్, లక్ష్మి దంపతులు 30 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి భైరామల్‌గూడ ప్రాంతంలోని సాయినగర్ కాలనీలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. వీరికి ఇద్దరు కుమారులు.పెద్ద కుమారుడు అనిల్ అమెరికాలో స్టాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా, 2వ కుమారుడు బుర్రా మణిదీప్‌గౌడ్ పాలిటెక్నిక్ పూర్తిచేసి ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం మణిదీప్ తన పదో తరగతి స్నేహితులు హస్తినాపురం డివిజన్ ద్వారకానగర్ కాలనీకి చెందిన బండారు శివకృష్ణ ప్రసాద్ గౌడ్, మెగావత్ నిఖిల్‌తో కలిసి ఐ 20 కారులో శ్రీశైలం వెళ్లి స్వామివారిని దర్శించుకున్నారు. శ్రీశైలం నుంచి తిరిగి వస్తూ రాత్రి ఆమన్‌గల్‌లోని స్నేహితుడి ఇంట్లో బస చేశారు. శుక్రవారం తెల్లవారు జామున అక్కడి నుంచి నగరానికి వస్తుండగా, ఆమన్‌గల్ మండలం రామ్‌నుంతల శివారు ప్రాంతంలో వారు ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న ఆర్‌టీసీ బస్సును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మణిదీప్, బండారు శివకృష్ణప్రసాద్ గౌడ్, మెగావత్ నిఖిల్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మణిదీప్ మృతదేహాన్ని సాయినగర్‌లో ఆయన నివాసానికి తీసుకొచ్చారు.

విషాద ఛాయలు..

అందరితో స్నేహంగా ఉంటూ ఆత్మీయంగా పలకరించే మణిదీప్ మృతితో భైరామల్‌గూడ సాయినగర్‌లో విషాద ఛాయలు అలుముకున్నాయి. బంధువులు, స్నేహితులు, సహ ఉద్యోగులు అతని ఇంటికి చేరుకున్నారు.మృతదేహాన్ని చూసి కంటతడి పెట్టారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం మృతదేహాన్ని స్వగ్రామం రేపల్లెకి తరలించారు.

'కారుణ్య సింధు'లో ఉచిత కంప్యూటర్ శిక్షణ

సైదాబాద్: ఐఎస్ సదన్ డివిజన్ కృష్ణానగర్ కాలనీలోని కారుణ్య సింధు ఆశ్రమంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రం ప్రారంభిస్తున్నామని కరుణశ్రీ సేవాసమితి ప్రధాన కార్యదర్శి పుప్పాల వెంకటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం ఆయన ఆశ్రమం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. జూన్ 8న ప్రారంభమయ్యే ఈ ఉచిత శిక్షణ కేంద్రంలో ప్రతీ ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు కంప్యూటర్ శిక్షణలో నిపుణులతో తరగతులు ఉంటాయన్నారు. యువత కంప్యూటర్ విద్యలో నైపుణ్యం పెంపొందించుకునేందుకు ఉచిత శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆసక్తి గల వారు ఆశ్రమం కార్యాలయంలో లేదా...సెల్ నం: 9000889785, 7386247393లను సంప్రదించి జూన్ 5లోపు తమ వివరాలు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

ఇన్‌చార్జి కమిషనర్‌గా చంద్రశేఖర్

తుర్కయంజాల్: తుర్కయంజాల్ మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్‌గా ప్రస్తుతం మీర్‌పేట కమిషనర్‌గా పనిచేస్తున్న బి.చంద్ర శేఖర్‌ను నియమిస్తూ డైరక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డి.దివ్య శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డిపై ఇటీవల సస్పెన్షన్ వేటు పడిన విషయం తెలిసిందే.

మండీలో జేబు దొంగల చేతివాటం

ఖరీదైన ఐ ఫోన్ అపహరణ

చంచల్‌గూడ: మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో శుక్రవారం జేబు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. కూరగాయలు కొనేందుకు మార్కెట్‌కు వచ్చిన ఓ వ్యక్తికి చెందిన ఖరీదైన ఐ ఫోన్‌ను అపహరించారు. వివరాలు...మేడ్చల్‌కు చెందిన నర్సింగ్‌రావు మాదన్నపేట మార్కెట్‌కు వచ్చాడు. పని ముగించుకుని ఇంటికి వెళ్లే సమయంలో అతడి ఐ ఫోన్ కనిపించలేదు. అన్ని చోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో తన ఫోన్ చోరీకి గురైందని మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, మొబైల్ తస్కరించిన వ్యక్తి చార్మినార్ పరిసరాల్లో తిరుగుతున్నట్టు ఫోన్‌లోని టెక్నాలజీ సహాయంతో పోలీసులు గుర్తించారు.

మలక్‌పేటలో యువతి అదృశ్యం

మలక్‌పేట: హాస్టల్ నుంచి ఇంటికి బయలుదేరిన ఓ యువతి అదృశ్యమైన ఘటన మలక్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఏఎస్‌ఐ తేజ్‌నాయక్ కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లా సోగనూర్ గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాంకోటి రెడ్డికి లావణ్య(19)తో గతేడాది ఆగస్టు 4న పెళ్లైంది. ఇద్దరూ కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు కాలనీలోని జయనగర్‌లో కాపురం పెట్టారు. ఇలా ఉండగా, లావణ్య దిల్‌సుఖ్‌నగర్ మాస్టర్ మైండ్స్ కాలేజీ హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతోంది. కళ్లు మండుతున్నాయని, ఇంటికి వస్తానని హాస్టల్ వార్డెన్ నుంచి పర్మిషన్ తీసుకోమని ఈనెల 16న భర్తకు ఫోన్ చేసింది. అతను వార్డెన్ నుంచి అనుమతి తీసుకోగా, సాయంత్రం 7.30కి లావణ్య తన సెల్‌ఫోన్‌ను హాస్టల్‌లోనే ఉంచేసి బయటికి వెళ్లింది. కేపీహెచ్‌బీ కాలనీ మెట్రో స్టేషన్ వద్ద భార్య కోసం వేచి చూసిన భర్త రాంకోటిరెడ్డి ఆమె రాకపోవడంతో అత్తింటి వారితో పాటు ఇతర బంధు, మిత్రులను వాకబు చేసినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా,కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెత్త, మట్టి కుప్పల తొలగింపు



కాలనీ రహదారిలో పేరుకుపోయిన చెత్త కుప్పలు (నిన్న)



చెత్త తరలించటంతో శుభ్రంగా కనిపిస్తున్న రహదారి (నేడు)

సాక్షి ఎఫెక్ట్..

చైతన్యపురి: 'ఎక్కడ చూసినా చెత్తే... శీర్షికన 'సాక్షి' లో వచ్చిన కథనానికి స్పందన వచ్చింది. గడ్డిఅన్నారం డివిజన్‌లోని పలు కాలనీల్లో శానిటేషన్ పనులు సక్రమంగా జరగక పోవటంతో రహదారుల పక్కన మట్టికుప్పలు, చెత్త పేరుకుపోయి కాలనీవాసులకు ఇబ్బందులు కలుగుతున్నాయని వచ్చిన వార్తకు స్థానిక కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి తీవ్రంగా పరిగణించారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బందిని పిలిపించి కోదండరాంనగర్, శారదా నగర్ ప్రాంతాల్లో ఎన్నో రోజులుగా పేరుకుపోయిన చెత్త, మట్టికుప్పలను తొలగింపజేశారు. అలాగే సరూర్‌నగర్ మినీట్యాంక్ బండ్‌పై ఉన్న చెత్తకుప్పలను, చెరువు నీటిలోని చెత్త కవర్లు, వ్యర్థాలను ఎంటమాలజీ సిబ్బందితో తొలగింపజేశారు. ఇకపై నిత్యం చెత్త తరలింపును పర్యవేక్షించి మరోసారి చెత్త కుప్పలు పేరుకుపోకుండా చూస్తానని కార్పొరేటర్ తెలిపారు. అలాగే కాలనీ రహదారుల పక్కన చెత్త, భవన నిర్మాణాల వ్యర్థాలను వేయకుండా కాలనీ సంక్షేమ సంఘాలు చూడాలని కోరారు. సమస్యపై కథనం ప్రచురించి చెత్త తరలించేలా చేసినందుకు కాలనీవాసులు 'సాక్షి' కి కృతజ్ఞతలు తెలిపారు.

వరద కాలువ నిర్మాణానికి సహకరిస్తాం..

- 'సాక్షి' కథనానికి స్పందించిన మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

వనస్థలిపురం: 'ఏటేటా అదే తంతు' శీర్షికన శారదానగర్‌లో ముంపు సమస్యపై శుక్రవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన కథనానికి స్పందన వచ్చింది. శారదా నగర్ లో వరద కాలువ నిర్మాణానికి భూయజమానులు అడ్డుపడుతున్నారని, దీంతో కాలనీవాసులకు వరద సమస్య తప్పడం లేదని కథనంలో 'సాక్షి' లో పేర్కొంది. ఈ కథనానికి భూయజమానులలో ఒకరైన హయత్‌నగర్ మాజీ కార్పొరేటర్, బీజేపీ నాయకుడు సామ ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. శారదానగర్ దిగువన వరద కాలువ నిర్మాణానికి భూమి యజమానులమైన తనతో పాటు తన సోదరులు సామ రంగారెడ్డి, సామ శ్రీనివాస్‌రెడ్డి గతంలోనే మున్సిపల్ అధికారులకు అంగీకార పత్రం ఇచ్చామన్నారు. ఈ విషయంపై మున్సిపల్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా స్థానిక కార్పొరేటర్, మున్సిపల్ అధికారులు తగిన ప్రణాళికతో ముందుకు వస్తే సంబంధిత పత్రాలు అందజేసి వరద కాలువ నిర్మాణానికి తమ వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. కాలనీవాసులు సైతం రాజకీయాలకు అతీతంగా ఈ విషయంలో తమ వద్దకు వస్తే సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.